



రాణీ పులోమజాదేవి

# కుక్కకు కోపమొచ్చింది!

యాథాలాపంగా ఆఫీసులోకి వెళ్లబోతూ పక్కనున్న పాడుబడ్డ ఇంటివైపుకు చూసింది విభవ. అరమోడ్పు కనులతో తృప్తిగా పడుకునుంది ఆ కుక్క. దాని చుట్టూ మూగి పాలు తాగడంకోసం ఎగబడుతున్నాయి దాని పిల్లలు. సరిగ్గా వారం రోజుల క్రితమే అక్కడ ఆ ఎనిమిది పిల్లల్ని ఈనింది ఆ తల్లికుక్క.

ఆ రోజు నుండి ఆఫీసుకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు దాన్ని గమనించడం ఓ దినచర్య అయిపోయింది విభవకు. ఎనిమిది కుక్కపిల్లలూ ఎనిమిది రకాలుగా ఉన్నాయి. తెల్లగా ఒకటి, నల్లగా ఒకటి, తెలుపుమీద నల్లమచ్చలతో ఒకటి, ఎర్రగా ఒకటి, ఎరుపుమీద తెల్లమచ్చలతో ఒకటి, అంతా తెల్లగా ఉండి, మూతి మాత్రం నల్లగా ఉండేదొకటి ... ఇలా రకరకాల కాంబినేషన్లలో ఏ రెండూ ఒక పోలికతో లేకుండా ఉన్నాయి. వాటిని చూస్తుంటే చాలా విచిత్రంగా అనిపించింది విభవకు. ప్రపంచపటంలోని దేశాలన్నింటిలోని వివిధ ఆకారపు వ్యక్తులనూ ఒకే కాన్పులో కన్న విశ్వమాతలా అనిపించింది ఆ కుక్క ఆమెకు.

ఒక్కో కుటుంబానికి ఇద్దరు పిల్లలే ఎక్కువని ఒక్కరితోనే, మేధావి అయిన మానవుడే సరిపెడుతుంటే ... ఈ కుక్కేమో ఇట్లా డజన్లకొద్దీ పిల్లల్ని కనిపారేస్తోంది. ఇలా కుక్కలన్నీ హద్దు లేకుండా కనడం, మునిసిపాలిటీవాళ్లు వీటిని పట్టుకుని చంపాల్సిరావడం ... ఈ అవస్థ లేకుండా కనబడ్డ కుక్కకల్లా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేస్తే సరిపోతుందిగా! తన పిచ్చి ఆలోచనకు తానే నవ్వుకుంటూ వెళ్లి సీట్లో కూర్చుంది విభవ. పక్కనే కిటికీ. దానిగుండా చూస్తే వీధిలో వచ్చేపోయేవారంతా కనిపిస్తూంటారు ఆమెకు.

ప్రాణులన్నింటిలోనూ తెలివిగలవాడనిపించుకుని, ఉండేందుకు ఇల్లు, కట్టుకునేందుకు గుడ్డ, తినేందుకు రుచిగా వండిన వంటలూ ఏర్పరచుకోవడం తెలుసుకున్న మానవుడే సాంఘిక కట్టుబాట్ల వల్ల కలిగే బాధ్యతలను వదిలేస్తున్న ఈ రోజుల్లో, బుద్ధిలేని ఈ కుక్క ఆ కూనలకు తానేం చేయగలనని, అన్ని పిల్లల్ని కన్నట్లో!? ఆ కుక్కపిల్లల్ని తలుచుకుని జాలిపడింది విభవ. ఆ వీథికుక్కను గురించి ఇన్ని ఆలోచనలెందుకని ఎన్నిసార్లో అనుకుంటుంది మనసులో. కానీ, మళ్లీ మామూలే.

హఠాత్తుగా తన కుటుంబం గుర్తొచ్చిందామెకు. ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్లు, అమాయకురాలైన తల్లి, తను,

తమనందరినీ గాలికి వదిలి తిరిగే తండ్రి.

ఒకరకంగా చెప్పాలంటే చిన్నప్పటినుండీ బాధ్యతలూ, కట్టుబాట్లూ లేకుండా విచ్చలవిడిగా తిరిగేవాడట తన తండ్రి. దాంతో పెళ్లి కూడా అవసరమనిపించలేదట చాలా కాలం వరకూ ఆయనకు. అనుకోకుండా ఓ రోజు అమ్మను చూసి ఇష్టపడి పెళ్లి చేసుకోవాలనుకున్నాడట. బీదరికంలో మగ్గుతూ, ఇంకా వెనుక ముగ్గురాడపిల్లలున్న తన అమ్మమ్మ మగ దిక్కులేని తానింతకన్నా మంచి సంబంధం తేగలనా అని ఆ మూడు ముళ్లూ వేయించిందట. పుట్టింటినుండి సారెలైతే పెట్టలేదు కానీ, ఇంక ఏ రకంగా ఈ ఇంటిపై ఆధారపడవద్దని మాత్రం గట్టిగా చెప్పి పంపింది కూతురిని.

ఆ రోజు నుండి ఈ రోజు వరకూ మరబొమ్మ అయింది అమ్మ. ఆయన తిరుగుళ్లకూ, తిట్లకూ, దెబ్బలకూ ఏ రోజూ ఉలకలేదు, పలకలేదు. ఆయన, ఆమె తన భార్య అనేందుకు గుర్తుగా అయిదుగురు పిల్లల్ని మాత్రం ఇచ్చాడు.

ఏనాడూ పిల్లలు కోరిన గుడ్డ, కడుపునిండా తిండి పెట్టలేదు ఆయన. ఉన్న ఊళ్లోని చదువే కాబట్టి... అదే, ఫీజు కట్టవలసిన అవసరం లేదు కాబట్టి ఇంటర్ వరకూ సాగింది విభవ చదువు లైబ్రరీ పుస్తకాలతో. అంతవరకూ ఇంట్లో ఖర్చుకు అంతో ఇంతో ఇస్తున్న తండ్రికి కూతురు కూడా సంపాదిస్తే తానింకా జల్సాగా తిరగొచ్చుగా అనే ఆలోచన వచ్చిందేమో! ఎవరి కాళ్లో కడుపులో పట్టుకుని తనకి ఉద్యోగం ఇప్పించాడు. ఆ రోజు నుండి తనా ఇంటికి బాధ్యత గల యజమానినని మరిచిపోయాడు. డబ్బు ఇవ్వకున్నా తన ఆధిపత్యం మాత్రం కొనసాగిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు ఆ బాధ్యతలన్నీ తన నెత్తిన పడ్డాయి. తను ఉద్యోగంలో చేరాక ఒకసారి మామూలుగా ఇంటి ఖర్చుకు డబ్బులిమ్మని అడిగిన అమ్మకు జరిగిన సన్మానం చూశాక, ఇంకెప్పుడూ ఆయనను డబ్బులడగవద్దని తనే చెప్పింది అమ్మతో. ఉన్నదాంతోనే పొదుపుగా ఖర్చు చేస్తూ గడుపుకుందామనుకున్నారు.

డబ్బులివ్వకున్నా, ఆయనకు జరగాల్సిన మర్యాదలలో ఎలాంటి లోపమూ రాకూడదు. నెలాఖరని చేతిలో డబ్బు లేక కూర చేయలేదని ఒక రోజు ఆయన చేసిన గొడవ అంతా ఇంతా కాదు. చెప్పలేనంత కోపమొచ్చింది తనకు.

".... ఇన్నాళ్లకు నన్నెదిరించే గాంగ్‌ను తయారుచేసుకున్నదన్నమాట మీ అమ్మ. మీకు అనవసరమనిపించినప్పుడు ఇక ఇక్కడ ఉండాలని నాకూ లేదు. అయినా ఓ సారి వీధి అరుగుమీద కూర్చుని ఉంటా. మీకు నాతో అవసరమనిపిస్తే, వచ్చి పిలవండి. అదీ నన్ను గౌరవించ గలిగినట్ల యితేనే! ఓ అయిదు నిమిషాలు బయటే కూర్చుంటాను!" వెళ్లిపోయాడు నాన్న



"ఏంటి నాన్నా ఇది? ఇంటి బాధ్యత తీసుకోకపోగా, ఈ గొడవలు చేయడమేమిటి? ఎందుకలా అమ్మను గొడ్డును బాదినట్లు బాదుతారు? ప్రతిరోజూ పంచభక్ష్య పరమాన్నాలు కావాలంటే ఎలా వస్తాయి? ఇదేం బాగాలేదు!" అంది తను.

చెల్లెళ్లూ, తమ్ముళ్లూ, అమ్మ అందరూ నిశ్చేష్టులైపోయారు. ఆ రోజు నాన్న చేతిలో తనకేదో మూడిందనుకున్నారు. కానీ విచిత్రంగా ఏమాత్రం కోప్పడలేదు నాన్న.

"ఓహో! అయితే నాలుగు రాళ్లు సంపాదించేసరికి నీకు కొమ్ములు మొలిచాయన్నమాట! భేష్! ఇంకేం, నాతో మీ అవసరం తీరిపోయిందిగా! నేనుండటం ఇకపై అనవసరం. ఇన్నాళ్లకు నన్నెదిరించే గాంగ్‌ను తయారుచేసుకున్నదన్నమాట మీ అమ్మ. మీకు అనవసరమనిపించినప్పుడు ఇక ఇక్కడ ఉండాలని నాకూ లేదు. అయినా ఓ సారి వీధి అరుగుమీద కూర్చుని ఉంటా. మీకు నాతో అవసరమనిపిస్తే, వచ్చి పిలవండి. అదీ నన్ను గౌరవించ గలిగినట్ల యితేనే! ఓ అయిదు నిమిషాలు బయటే కూర్చుంటాను!" వెళ్లిపోయాడు నాన్న.

"ఎంత పని చేశావే? ఇన్నాళ్లూ నేను నోరు మెదపకుండా భరించిన కష్టాల ఫలితాన్నంతా ఒక్క క్షణంలో కూలదోశావు!" బాధగా అంది అమ్మ.

"ఎందుకమ్మా నీ వింతగా బాధపడతావు? ఇప్పుడు కొంపలేం మునిగాయి? ఎలాగూ ఆయన మనల్ని పోషించడంలేదుగా... పోతే పోనీ!" అంది తను.


"అయ్యో, పిచ్చిదానా! అనుభవం లేకనే నీ వలా మాట్లాడుతున్నావు. ఇన్ని రోజులూ మీ నాన్నను వదిలిపెట్టకుండా అంటిపెట్టుకుంది ఆయన పెట్టేమాత్రం తిండి, ఎక్కడైనా పనిచేసి నేను సంపాదించుకోలేక కాదే! మగ దిక్కు లేని సంసారాన్ని సమాజం హీనంగా చూస్తుంది. పైగా, ముగ్గురు పెండ్లి కావలసిన ఆడపిల్లలు. ఇలాంటి స్థితిలో ఆయన మనల్ని వదిలి వెళ్తే మనం ఎలా తలెత్తుకు తిరగగలుగుతాం? తిన్నా, తినకున్నా ఇన్నాళ్లూ నాలుగ్గోడల మధ్య గుట్టుగా బతుకుతున్న మనల్ని మనమే వీధిన పెట్టుకున్నట్లవుతుంది. నా మాట విను, వెళ్లి మీ నాన్నకు క్షమాపణ చెప్పు!" బతిమాలింది అమ్మ.

చెల్లెళ్లు, తమ్ముళ్లు బిక్కమొహంతో చూస్తున్నారు.

"నేను పిలవనమ్మా! కావాలంటే నీవే పిల్చుకో."

బయటకెళ్లి "ఏవండీ! చిన్నపిల్ల పొరపాటుగా ఏదో అందని మీ రిలా కోప్పడితే ఎలా? ఈసారికి క్షమించి లోపలికొచ్చేయండి!" ప్రాథేయపడింది అమ్మ.

"ఏం, చేసిన తప్పుకు క్షమాపణ చెప్పుకునే తీరిక కూడా లేకుండా ఉందా నీ కూతురు?



అవునులే, డబ్బులు సంపాదిస్తోంది కదూ, మర్చేపోయాను!" వ్యంగ్యంగా అన్నాడు నాన్న.

బిక్కమొహంతో లోపలకొచ్చింది అమ్మ. దీనంగా చూసింది తనవైపు. విధిలేక బయటకొచ్చింది తను.

"నాన్నా! పొరపాటైంది, క్షమించండి!"

"అయ్యో.... ఎంత మాటమ్మా! నిన్ను క్షమించడమా? నా కంత హోదా ఎక్కడుందమ్మా? కాకపోతే ఆత్మాభిమానం ఉన్నవాణ్ణి కాబట్టి భరించలేకపోయాను. నే చెప్పిన షరతు నీ కిష్టమైతేనే వస్తాను. లేకుంటే నా దారిన నేను పోతాను. ఎవరినీ ఇబ్బంది పెట్టడం నా ఉద్దేశ్యం కాదు!" అన్నాడు నాన్న.

రెక్కలు రాని పిల్లలను, బాధ్యతలను వదిలి పారిపోవడానికి సిద్ధమైన వ్యక్తికి ఒకరిని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేదట! అసలు ఇబ్బంది అనే పదానికి అర్థం తెలుసా ఆయనకు?

"లేదులెండి, నాన్నా! ఇకమీదట మీరు చెప్పినట్లే చేస్తాను. మీ గౌరవానికి ఇక్కడ ఏ భంగమూ కలగదు!"

అలవాటైన శాడిస్టిక్ చిరునవ్వు నవ్వుతూ విజయగర్వంతో లోపలికొచ్చాడు నాన్న. అంతలోనే ఎప్పుడు ఎలా తెప్పించిందో కానీ, అమ్మ కూర సిద్ధంచేసి నాన్నను బతిమాలి అన్నం తినిపిస్తోంది.

అమ్మనలా చూస్తుంటే చాలా ఆశ్చర్యం వేసింది తనకు. ఎంత సహనం ఈమెకు! తనను అనుక్షణమూ చిత్రహింస పెట్టే వ్యక్తిపై ఇంత ఆదరం ఎలా చూపగలుగుతోంది? కేవలం పుట్టింటి ఆశ లేకపోవడమే కారణమైతే, నాన్నను అసహ్యించుకుంటూ బతికేదే! కానీ ఆయనపట్ల ఇంత అనురాగం చూపగలిగేది కాదు. ఈ అనురాగం.. ఇదే భారత స్త్రీ సంస్కారం! మనసులోనే ఆమెకు జోహార్లర్పించింది తను.

నాన్నకు కోపం రాకుండా ఉండటానికి, ఆయన కోరిన వంటలు చేసిపెట్టడానికి తన జీతం చాలదు కదా! అందుకే ఆ రోజు నుండీ తీరికవేళల్లో అమ్మ విస్తళ్లు కుడితే, తను బుట్టలల్లి, ఎంబ్రాయిడరీ చేసి ఆదాయం పెంచాల్సి వచ్చింది. అప్పటికే ఇంటి పనులతో, నాన్న వేధింపులతో శారీరకంగా, మానసికంగా అరగదీసిన గంధపుచెక్కలా అయిపోయిన అమ్మను చూస్తే జాలనిపిస్తోంది తనకు. కానీ చెయ్యగలిగిందేముంది?

ఓ రోజు స్కూలుకని వెళ్లిన చిన్న తమ్ముడు వెంటనే తిరిగి వచ్చాడు. వాడి కళ్లలో నీళ్లు. ఏమైందని అడిగింది అమ్మ. వాడు స్కూలు తరఫున ఎక్స్‌కర్షన్ కెళ్తానంటే తనిచ్చిన వంద రూపాయలు నాన్న దారిలో కనబడి లాక్కున్నారట. ఎందుకంటే, ఆయన చదువుకునే రోజుల్లో ఎవరూ ఆయన్ను ఎక్స్‌కర్షన్ పంపలేదట. కాబట్టి ఇప్పుడు వీడు వెళ్లకుంటే ఏమీ మునిగిపోదట. ఏడుస్తూ చెప్పాడు వాడు.

ఎందుకిలా చేస్తాడు ఆయన? తను ఎక్కడికీ వెళ్లనంత మాత్రాన తన పిల్లలు కూడా వెళ్లకూడదా? అంతెందుకూ, మొన్నటికి మొన్న పెద్ద తమ్ముడిని ఇంటర్‌లో చేర్చినందుకు పెద్ద రాద్ధాంతం. "నన్నెవ్వడూ చదివించలేదు. అయినా నాకు ఉద్యోగం దొరకలేదా? మరి వీళ్లనెందుకు చదివించాలి? వీళ్లకు పెడుతున్న దండగ తిండి చాలదా?" అంటూ. అక్కడికేదో తన చేతినుండి పెడుతున్నట్లు. ఆ విషయంలో మాత్రం తను గట్టిగా ఎదిరించింది. వాళ్ల చదువు విషయంలో ఆయన్ను జోక్యం చేసుకోవద్దనీ, ఆ ఖర్చేదో తనే భరిస్తానని చెప్పింది. ఇంకేమీ చెయ్యలేక పిల్లల్ని సరిగ్గా పెంచలేదని అమ్మను కోప్పడి వెళ్లిపోయాడు.

ఆ రోజుల్లో... అంటే, ఎక్కువగా చదవకపోయినా ఉద్యోగాలొచ్చేవి. ఇప్పుడా అవకాశం ఎక్కడుంది? ప్రస్తుతం ఉన్న కాంపిటీషన్లో నెగ్గాలంటే తెలివితేటలతోపాటు సర్టిఫికెట్లూ అవసరమే. అయినా అతి తక్కువస్థాయిలో ఉన్నవాళ్లు కూడా తమ పిల్లలు తమకన్నా ఉన్నతస్థాయికి వెళ్లాలని శక్తికి మించి కష్టపడుతూ, వాళ్లు పైకొస్తే చూసి ఆనందంతో తమ కష్టాన్ని మరిచిపోతారు. ఈయనమాత్రం సరిగ్గా అందుకు వ్యతిరేకం. తను కన్న సంతానపు అభ్యున్నతిని కూడా ఓర్వలేనంతగా అసూయ, శాడిజం పేరుకుపోయాయి ఆయనలో. తను పెట్టిన గుడ్లను తానే తినే పామే ఆయనకు సాటి.

దబదబా వర్షం పడుతున్న శబ్దానికి ఒక్కసారిగా తన ఆలోచనలనుండి బయటకు వచ్చింది విభవ. చాలా జోరుగా పడుతోంది వర్షం. కిటికీగుండా చూస్తుంటే హఠాత్తుగా ఆ కుక్క, దాని పిల్లలు గుర్తుకువచ్చాయి ఆమెకు.

"తెలివితేటలున్న మానవజన్మ ఎత్తిన తన తండ్రే పిల్లలకు రక్షణ కల్పించనప్పుడు, ఈ జ్ఞానం లేని కుక్క వర్షంలో తడిసిపోతున్న తన పిల్లలకు రక్షణ ఎలా కల్పిస్తుంది?" అనుకుంటూ తలెత్తి చూసేసరికి ఆ తల్లి కుక్క తన బుజ్జిపిల్లలను నోట కరుచుకుని వస్తోంది.

ఆ వరండాలో వర్షపు జల్లు పడనిచోట మిగిలిన పిల్లలన్నీ పడుకుని ఉన్నాయి. నోట్లో ఉన్న చివరి పిల్లను కూడా జాగ్రత్తగా అక్కడ పడుకోబెట్టి, తలెత్తి విభవవంకే కోపంగా చూసింది ఆ తల్లికుక్క.

'బహుశా తన తండ్రిలాంటి వాడితో పోల్చి తనను కించపరిచానని దానికి కోపమొచ్చింది కాబోలు!' అనుకుంది విభవ మనసులో. ■

ఆంధ్రప్రభ పాఠకులకు మాత్రమే ఈ అపూర్వకానుక!

వేదం భారతజాతి జీవననాదం. వందేళ్లుగా మరేభాషలోనూ ఎవరూ చేయని అద్భుతాన్ని డాక్టర్ దాశరథి రంగాచార్య తెలుగులో చేశారు. ఋగ్వేద యజుర్వేద సామవేద అధర్వణవేదాలను చిక్కటి సంస్కృతం నుంచి (9 సంపుటాలు) చక్కటి తెలుగులోనికి అనువదించారు. వేదాలను మనదైన భాషలో హాయిగా చదువుకునే అవకాశం ఇది! ఎమెస్కో ఆర్షభారతి వీటిని రు.2,950/లకు విక్రయిస్తోంది. ఆంధ్రప్రభ పాఠకులకు మాత్రం రు.2000/లకే అందిస్తోంది. ఈ కింది కూపన్ నింపి నగదును డీడీరూపంలో **EMESCO ARSHABHARATHI , VIJAYAWADA** పేరిట తీసి ఎమెస్కో ఆర్షభారతి, ఏలూరురోడ్, విజయవాడ-చిరునామాకు పంపితే చాలు. పోస్టల్ ఛార్జీలు కూడా భరిస్తూ రు.2000/లకే మీకు వేదాలు పంపుతారు. ఈ కూపన్‌ను ఎమెస్కో బుక్‌షాప్‌లో ఇచ్చికూడా వీటిని పొందవచ్చు.

మహత్తరమైన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీ ఇళ్లను మంగళకర వేదపఠనంతో శుభకరం చేసుకోండి!

ఎమెస్కో ఆర్షభారతి-ఆంధ్రప్రభ

పేరు: ----------------------------------------

వృత్తి: ----------------------------------------

చిరునామా: ----------------------------------------

----------------------------------------

డీడీ నంబరు: ----------------------------------------